వెల్లివిరిసిన క్రీడానందం

శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ఆధునికీకరణ, మిగిలిపోయిన పనులకు మోక్షం కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేఆర్ స్టేడియం ప్రాంగణంలో ఆదివారం 'థ్యాంక్ యూ సీఎం సార్'.. 'జయహో ధర్మాన' పేరిట అభినందన సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ



మంత్రి ధర్మాన ప్రసాదరావును సత్కరిస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు



బాస్కెట్‌బాల్, సెపక్‌తక్ర క్రీడాకారులతో కృష్ణదాస్, క్రీడాసంఘ ప్రతినిధులు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెస్సార్, సుంకరి తదితరులు



హాజరైన ప్రముఖులు, క్రీడాసంఘ ప్రతినిధులు, క్రీడా పోషకులు, క్రీడాకారులు

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు



కలెక్టర్ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి శెల్వరాజన్, ఆమె భర్త, శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌లు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం నూతనంగా నిర్మించిన గోశాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి, శ్రీకాకుళం జేసీ నవీన్‌లు ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌ను గోత్రనామాలతో పూజలు చేశారు. అనంతరం శ్రీకూర్మనాయకి పూజలు జరిపించి వైష్ణవీదుర్గ, తాబేళ్ల పార్కును సందర్శించారు. ఈవో జి.గురునాథం క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు.

నడక పోటీల్లో ఉపాధ్యాయుడి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న ఉపాధ్యాయుడు సుధాకర్

లావేరు: ఉత్తరాంధ్ర స్థాయిలో నిర్వహించిన నడక పోటీల్లో లావేరు హైస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సంజీవిని నళినిసుధాకర్‌కు ద్వితీయ స్థానం లభించింది. ఈ విషయాన్ని ఉపాధ్యాయుడు తెలియజేశారు. విశాఖపట్నంలోని పోలీస్ క్రీడా మైదానంలో ఆదివారం ఉత్తరాంధ్ర స్థాయిలో నడక పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుధాకర్ పాల్గొని 5 కిలో మీటర్లు నడక పోటీల్లో ద్వితీయ స్థానం సంపాదించాడు. క్రీడల అసోసియేషన్ కార్యదర్శి వెంకటాద్రి బహుమతి అందజేశారు. ఉపాధ్యాయుడిని హెచ్ఎం పి.జగన్నాథరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారంపురం పంచాయతీ చినరావుపల్లి గ్రామంలో రూ.4.50 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న సిమెంట్ కాలువ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక నాయకుడు దుంప చిన్నారెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'చదవడం మాకిష్టం'



పద్యాల పోటీల్లో పాల్గొన్న విద్యార్థి

లావేరు: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పద్యాలు నేర్చుకోవాలని లావేరు శాఖాగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పద్యాలు చదవడంపై పోటీలు నిర్వహించి, బాగా చదివిన ముగ్గురు విద్యార్థులకు గ్రంథాలయాధికారి బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి ధర్మాన పరామర్శ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరంలోని 80 ఫీట్ రోడ్డులోని స్వగృహంలో నివాసముంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చల్లా శ్రీనివాస్‌కు మాతృ వియోగం కావడంతో ఆదివారం ఆమె భౌతికకాయానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు నివాళులు అర్పించారు. అన్ని వేళలా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

పాస్టర్ జాకబ్ అధికారికి వీడ్కోలు



పాస్టర్ జాకబ్ అధికారి దంపతులను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు బాప్టిస్టు చర్చిలో 23 ఏళ్లుగా సేవలందించిన డాక్టర్ రెవ.జాకబ్ అధికారికి ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ముందుగా సంఘ పెద్దలు జాకబ్ సేవలను కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహీత మాట్లాడుతూ దేవుని సేవలో ఉన్నప్పుడు కొన్నిసార్లు అవరోధాలు కూడా ఎదురవుతాయని, వాటిని దాటుకొని వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు డి.బి.డి.కుమార్, ఎం.ఆనంద రత్నకుమార్, డి.ఎల్.బి.ఎల్.కుమార్, డి.ప్రసాదరరావు, ఎంఎస్‌సీ శేఖర్, స్త్రీల సంఘం ప్రెసిడెంట్ సరోజ, సండే స్కూల్ ప్రతినిధి వసంతకుమారి, యూత్ ప్రెసిడెంట్ బృంద ఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశయన కులస్తుల సంక్షేమానికి కృషి



మంత్రి ధర్మాన ప్రసాదరావును సన్మానించిన శ్రీశయన కులస్తులు

శ్రీకాకుళం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీశయన కులస్తులు రుణపడి ఉంటారని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పెదపాడులోని ధర్మాన క్యాంపు కార్యాలయంలో ఆదివారం శ్రీ శయన కులస్తుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆరుగురు శ్రీశయనులకు నామినేటెడ్ పదవులు ఇచ్చినట్లు తెలిపారు. శ్రీశయనులంటే తనకు అభిమానమని, అవకాశం ఉన్నంత వరకూ వారికి అందాల్సిన ఫలాలను దక్కేలా తోడ్పాడతానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, రాష్ట్ర అధ్యక్షుడు లోడ అప్పారావు, వంగా మహేష్, మెండ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శౌర్యజాగరణ యాత్ర



బూరవెల్లిలో శౌర్యజాగరణ యాత్ర రథం

గార: విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శౌర్యజాగరణ యాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. గార మండలంలోని బూరవెల్లి, పూస్లపాడు, కొత్తపేట, బోరవానిపేట, కుమ్మరిపేట, తూలుగు, నిజామాబాద్, సతివాడ, శ్రీకూర్మం తదితర గ్రామాల్లో రథాన్ని భక్తులు దర్శించుకున్నారు. హిందూ సమాజం, సంప్రదాయం, విశిష్టతలను తెలియజేయాలని సంకల్పంతో యాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రావాడ రాజశేఖరం, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు, చల్ల చంద్రమౌళి తెలిపాన్నారు.

ధర్మసూక్ష్మాలపై ప్రవచనాలు



ధర్మసూక్ష్మాలు వివరిస్తున్న భాస్కరభట్ల శ్రీరామ్మూర్తి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరంలో ఆదివారం సత్సంగ కార్యక్రమంలో భాగంగా ప్రవచనకర్త భాస్కరభట్ల శ్రీరామ్మూర్తి మహాభారతంలోని సంభాషణలలో ధర్మసూక్ష్మాల ఆవశ్యకతను వివరించారు. పాండవులు–ధౌమ్యుడు, ద్రౌపది–కీచకుడు, ధర్మవ్యాధుడు–కౌశికునికి మధ్య జరిగిన సంభాషణల్లో ధర్మ సూక్ష్మాలు వివరించారు. కార్యక్రమంలో ఉపనిషన్మందిర ప్రతినిధులు డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, ప్రభాకరరావు, పి.వి.ఎస్.సాయిప్రసాద్, సోమలింగం, అప్పలకొండ, జంధ్యం శరత్‌బాబు, కృష్ణవేణి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన



జిల్లేడు ద్రావణాన్ని తయారుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రణస్థలం: జిల్లేడు ద్రావణం తయారీపై ప్రకృతి వ్యవసాయ సేద్య రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ అవగాహన కల్పించారు. మండలంలోని తొలుత పైడిపేట గ్రామంలో పైడి సత్తిబాబుకు చెందిన పది సెంట్ల విస్తీర్ణంలో ఏటీఎం మోడల్ క్షేత్ర సందర్శన చేయడం జరిగింది. అనంతరం వెల్పురాయి గ్రామంలో పలువురు రైతులకు 600 లీటర్ల జిల్లేడు ద్రావణం తయారీ, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. 20 కేజీల జిల్లేడు ఆకులను పూర్తిగా దంచి 20 లీటర్ల ఆవు మూత్రంలో కలిపి 200 లీటర్ల డ్రమ్ములో వేయాలి. డ్రమ్మును పూర్తిగా 170 లీటర్ల నీటితో నింపి రోజుకు మూడు పూటలా కలుపుతుండాలి. ఇలా మూడు రోజులు చేసిన అనంతరం జిల్లేడు ద్రావణం తయారవుతుంది. ఈ ద్రావణం ఏడు రోజుల వరకు నిల్వ ఉంటుంది. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు ఎకరా పొలంలో పది లీటర్లు స్ప్రే చేస్తే పొటాస్ అవసరం ఉండదు. మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రశాంత్, మోడల్ మేకర్లు రాంబాబు, సత్యనారాయణ, కలివరపు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ఈ–కేవైసీ నమోదు పూర్తి



ఎందువలో ఈ–కేవైసీ నమోదును పరిశీలిస్తున్న ఏఓ

జి.సిగడాం: ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోగా ఈ–కేవైసీ నమోదు పూర్తి చేసుకోవాలని ఏఓ వై.శారద సూచించారు. ఎందువ, నడిమివలస, జి.సిగడాం, ఆనందపురం, టిడివలస, సీతంపేట, అద్వానంపేట గ్రామాల్లో చేపట్టిన ఈ–కేవైసీ నమోదును ఆదివారం పరిశీలించారు. రైతులు పండించే పంటలు విపత్తుల సమయంలో నష్టపోతే కచ్చితంగా పరిహారం అందేందుకు ఈ–కేవైసీ ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ రైతు తప్పనిసరిగా ఆర్‌బీకేకు వెళ్లి ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి హరితాశ్రీ

జి.సిగడాం: ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని స్థానిక వైద్యాధికారి పొన్నాడ హరితాశ్రీ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వేడి చేసిన నీటిని తాగాలన్నారు. అంటురోగాలు ప్రబలకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేటినుంచి ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్ల జారీ

రణస్థలం: రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి/జూన్ – 2023లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు సోమవారం నుంచి జారీ చేయనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ జి.సింహాచలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులందరూ గమనించి ఒరిజినల్ సర్టిఫికెట్లు పొందాలన్నారు.

రబీ సాగుపై అవగాహన ర్యాలీ



ఎచ్చెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో ప్రకృతి వ్యవసాయ సాగుపై ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రబీ వరి పంటలు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఎచ్చెర్ల ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి శ్రీదేవి మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్‌లో వరి సాగు తరువాత ఆరుతడి, అపరాలు సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ప్రధాన పంటలో అంతర పంటలుగా కూరగాయలు సాగు చేయాలన్నారు. తక్కువ నీటి వినియోగం, పంటల మార్పిడి వల్ల భూసారం పెరగటం, కూరగాయలు సాగు వల్ల రైతులకు ఆదాయం మెరుగు వంటి ప్రయోజనాలు ఉంటాయన్నారు. సిబ్బంది పూర్ణ, తులసి, మీన పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి సత్కారం



కుమార్‌రాజును సత్కరిస్తున్న శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: అంతర్జాతీయ గుర్తింపు పొందిన పల్నాడు జిల్లా శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కవి బుర్రి కుమార్‌రాజుకు ఆదివారం ఘన సత్కారం జరిగింది. శత కవి సమ్మేళనంలో కవితాగానం చేసిన కుమార్‌రాజును వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కొల్లి రమావతి, జి.ఈశ్వరీభూషణం, పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ శాంతాభాయి, గుండాల రాకేష్‌లు శాలువ, ప్రశంసాపత్రం, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.

ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ కామేశ్వరరావు

గార: మండలంలోని ముఖ్యమైన కూడళ్లలో స్థానికుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని సీఐ ఎస్.కామేశ్వరరావు ఆదివారం తెలిపారు. ప్రమాదాలు, నేరాలు, దొంగతనాలు జరిగే సమయంలో ఆధారాల సేకరణకు సీసీ కెమెరాలు అవసరం అవుతాయని పేర్కొన్నారు. వాడాడ, పూసర్లపాడు, కళింగపట్నం, తూలుగు, వమరవల్లి, సాలిహుండం జంక్షన్‌లలో వీటిని అమర్చుతామని చెప్పారు. వీటిని పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేయస్తామన్నారు. కార్యక్రమంలో టి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతికి అష్టోత్తర పుస్తకార్చన

శ్రీకాకుళం కల్చరల్: పట్టణానికి చెందిన కాశిని వెంకటేశ్వరరావు రచించిన శ్రీవాణి వికాసం పుస్తకాలతో రాజాంలో ఉన్న జ్ఞానసరస్వతి అమ్మవారికి అష్టోత్తర పుస్తకార్చనలు ఆదివారం నిర్వహించారు. అక్షరాభ్యాసాలు చేస్తున్న చిన్నారులకు వీటిని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రంపరామచంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 9న సీతారాముల కల్యాణోత్సవం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సేవాదళం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నవంబరు 9న సీతారామచంద్ర స్వామి కల్యాణం వేడుకలు, స్వర్ణ పాదుకా పుష్పాభిషేకం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు తెలిపారు. నారాయణ తిరుమలలోని మండపంలో ఆదివారం ఆహ్వాన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా అయోధ్య శ్రీరామాలయ నిర్మాణంలో ఏర్పడిన ప్రతిష్టంభన వీడి ప్రతిష్ఠాపన మహోత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో ఇక్కడ నవంబర్ 9న ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నామని చెప్పారు. జిల్లాకేంద్రంలోని ఏడురోడ్ల కూడలి వద్ద ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించేందుకు సిద్ధమయ్యామని పేర్కొన్నారు. దేశమంతా రామచంద్రుని పాదుకలతో మహాపాదయాత్ర జరుగుతుందని, నారాయణ తిరుమల దేవస్థానం అభ్యర్థన మేరకు నవంబరు 9న బంగారు పాదుకలను శ్రీకాకుళంలోని ఉత్సవ వేదిక వద్ద భక్తులు దర్శించుకునే అవకాశం కలిగిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి పాదులకు పుష్పాభిషేకం చేసుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. రామతీర్థాలు క్షేత్రం నుంచి స్వామివారి ఉత్సవమూర్తులను తెచ్చి రెండు వేల మంది దంపతుల సమక్షంలో కల్యాణ వేడుకలు నిర్వహిస్తామన్నారు. నారాయణ తిరుమల ధార్మిక సంస్థ, వేంకటరామానుజ సేవాదళం తగిన వనరులు అందిస్తాయని తెలిపారు. ఇందుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. భద్రాచలం నుంచి శ్రీసీతారామచంద్రుని లాంఛనాలు పొందే భాగ్యం కలుగుతుందని తెలిపారు. సమావేశంలో సేవాదళం సభ్యులు పొన్నాడ ధర్మారావు, వెంకటేశ్వర్లు, బొడ్డేపల్లి నాగభూషణం, ఎన్ని రాజేశ్వరరావు, ఆర్.వి.ఎన్.శర్మ, వేణుగోపాల్, సేవాదళ సభ్యులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు పందిరిరాట



లావేరు: బుడుమూరులో పందిరిరాట వేస్తున్న గ్రామస్తులు, కమిటీ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా ఎచ్చెర్ల, కొయ్యాం గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రులు నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం పందిరిరాట వేశారు. మండపాల నిర్మాణం చేయనున్నారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ పూజల్లో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బుడుమూరులో..

లావేరు: మండలంలోని బుడుమూరు గ్రామంలో ఆదివారం కనకదుర్గ అమ్మవారి ఉత్సవాల కోసం పందిరిరాట వేశారు. ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు దుర్గాదేవీ నవరాత్రి ఉత్సవాలను గ్రామస్తులు, కమిటీ సభ్యులు నిర్వహించనున్నారు. పందిరిరాట వేసి ఉత్సవ పనులను ప్రారంభించారు. గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు, కమిటీ సభ్యుల పాల్గొన్నారు.

విజయవాడకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



రణస్థలం: విజయవాడ బయలుదేరుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం:

సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో సోమవారం విజయవాడలో జరగనున్న పార్టీ ప్రతినిధుల సదస్సు నిర్వహించనున్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సారథ్యంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆదివారం బయలుదేరి వెళ్ళాయి.

ఎచ్చెర్ల మండలం నుంచి..

ఎచ్చెర్ల క్యాంపస్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో సోమవారం నిర్వహించనున్న కీలక సమావేశానికి ఎచ్చెర్ల మండలం నుంచి ప్రధాన నాయకులు ఆదివారం పయనమయ్యారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో కలిసి బయలుదేరి వెళ్లారు.